క్లుప్తంగా

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



ధన్వాడ: మండలంలోని కొండాపూర్ తెలంగాణ గిరిజన గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి కె.చరణ్ నాయక్ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడని గురుకుల ప్రిన్సిపల్ రాజారాం కోచ్ డాక్టర్.రామ్మోహన్‌గౌడ్, పీఈటీ ఆంజనేయులు తెలిపారు. ఈ నెల 20 నుంచి 26 వరకు మహబూబ్‌నగర్‌లో జరిగిన శిక్షణ శిబిరంలో పాల్గొని సత్తా చాటడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. చరణ్ ఈ నెల 28వ తేదీ నిజామాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీల్లో ప్రతిభ



మక్తల్: మక్తల్‌కు చెందిన మోహన్, వెంకటేశ్ అనే విద్యార్థులు హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహిస్తున్న సైక్లింగ్ అకాడమీలో ప్రవేశం పొందారని జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గోపాలం తెలిపారు. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీల్లో ఇద్దరు విద్యార్థులు సత్తా చాటడంతో అండర్–16 విభాగంలో అకాడమీలో ప్రవేశం సాధించారన్నారు. ఈ క్రమంలో ఇద్దరికి వారం రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమలలో కోశాధికారి రూప, కార్యదర్శులు నర్సింహ, సత్యాంజనేయులు, విష్ణువర్ధన్, అంబ్రేస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు రద్దు చేయాలి

మాగనూర్: మండల కేంద్రంలో ఉన్న ఇసుక రీచ్‌ల నుంచి ఇసుకను తరలించకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఇసుకను తరలించడంతో గ్రామానికి తాగునీటిని అందించే బోరు బావులు ఎండిపోయే అవకాశం ఉందని, అలాగే వ్యవసాయ బోరు బావుల్లో కూడా సరిపడా నీరు లభించదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అనుమతులు రద్దు చేయాలని కోరారు. వినతిపత్రం అందించినవారిలో శ్రీనివాసులు, ఆనంద్, మారెప్ప, క్రిష్ణ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌ల వితరణ



కోస్గిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ ఉపాధ్యాయురాలు గీత శుక్రవారం స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. వివిధ తరగతుల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు సొంత డబ్బులతో స్కూల్ బ్యాగులు తెప్పించి ఎంఈఓ శేఖర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ క్రమంలో ఎంఈఓ ఆమె సేవలను కొనియాడారు. పేద పిల్లలు చదువుకునేలా ప్రోత్సహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింములు, భాగ్యలక్ష్మి , అజ్మీర , సీఆర్‌పీ దస్తయ్య ఉన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించి బట్ట సంచులు వాడాలి



కోస్గి రూరల్: ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి బట్ట సంచులను వాడాలని అలాగే తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు సూచించారు. శుక్రవారం 100 రోజుల కార్యాచరణలో భాగంగా రామాలయం చౌరస్తా నుంచి శివాజీ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పలు వ్యాపార సముదాయాలకు నూతన ట్రేడ్ లైసెన్స్‌లను జారీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే జరిమానా వేస్తామన్నారు. తడి , పొడి చెత్తను వేరు వేరు బుట్టలలో వేయాలని, తడి చెత్త నుంచి ఎరువులు తయారు చేయవచ్చన్నారు. అమృత్‌జల్ పథకం ద్వారా ప్రతి గృహానికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలోమున్సిపల్ మెనేజర్ అనిల్‌కుమార్, హెల్త్‌అసిస్టెంట్ మోహిన్‌బాషా, మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది , కార్మికులు పాల్గొన్నారు.

గుంతల రోడ్లకు మోక్షమెప్పుడో..?

- దెబ్బతిన్న గ్రామీణ రహదారులు
- గుంతల్లో పడి గాయాలపాలవుతున్న వాహనదారులు



అధ్వానంగా తయారైన వర్కూర్–నేరడగం రోడ్డు

మాగనూర్: మండల పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు ప్రమాదకరంగా మారాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తోడు భారీ లోడ్‌తో వెళ్తున్న వాహనాల కారణంగా చాలా ప్రాంతాల్లో రహదారులు గుంతలమయంగా దర్శనమిస్తున్నాయి. గుంతలు పడి ధ్వంసమైన రోడ్లపై అలాగే ప్రయాణాలు కొనసాగిస్తుండడంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధానంగా మండలంలోని మాగనూర్ నుంచి వర్కూర్, నేరడగం, ఉజ్జెల్లి,



గుంతలమయంగా ఉజ్జెల్లి వెళ్లే రోడ్డు

ఇటు వడ్వాట్ నుంచి కోల్పూర్, మందిపల్లి వరకు ఉన్న ప్రధాన రహదారులపై ప్రయాణం చేయాలంటేనే ప్రజలు భయంతో వణికిపోతున్నారు. ఆయా గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్ల నిర్మాణ పనులు జరిగి చాలా ఏళ్లు కావడంతో ప్రస్తుతం ఈ రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీనికి తోడు గతంలో కురిసిన వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో గుంతల రోడ్లకు మోక్షం ఎప్పుడు లభిస్తోందోనని వాహనదారులు, ప్రయాణికులు ఆశగా ఎదురుచూస్తున్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు ఉన్న ప్రధాన రహదారులపై ప్రతి రోజు వందల సంఖ్యలో ద్విచక్రవాహనదారులు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ క్రమంలో ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్ల మధ్యలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో పాటు అక్కడక్కడ నెర్రెలు ఇచ్చి ప్రమాదకరంగా మారడంతో ప్రయాణించాలంటేనే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. ఇంకొన్ని చోట్ల అయితే అక్కడక్కడ బీటీ తొలగిపోయి అడుగులోతు గుంతలు పడడంతో వాటిని తప్పించబోయి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వానాకాలం ప్రారంభం కావడంతో గ్రామీణ రహదారులు మరింత అధ్వానంగా మారకముందే అధికారులు స్పందించి రోడ్లను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి..



మండల కేంద్రం నుంచి చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలతో అధ్వానంగా తయారయ్యాయి. ఏళ్లుగా అవే రోడ్లపై రాకపోకలు సాగిస్తూ ఇబ్బందులు పడుతున్నాం. ప్రస్తుతం వానాకాలం ప్రారంభం కావడంతో రోడ్లు మరింత దెబ్బతినే అవకాశం ఉంది. అధికారులు వెంటనే స్పందించి తాత్కాలిక మరమ్మతులు అయినా చేపడితే బాగుంటుంది. –రవి, ఉజ్జెల్లి, వాహనదారుడు

అధికారులు చర్యలు తీసుకోవాలి



రోడ్లన్నీ గుంతలమయంగా మారడంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధ్వాన రోడ్లపై రాత్రిపూట రాకపోకలు సాగించాలంటే మరింత ఇబ్బందిగా మారింది. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి పనులు ప్రారంభించాలి.
– వెంకటేష్, ఉజ్జెల్లి గ్రామస్తుడు

ప్రతిపాదనలు పంపిస్తాం..



మండలంలోని పలు గ్రామాల బీటీ రోడ్లు ధ్వంసమైన మాట వాస్తవమే. అయితే వాటి మరమ్మతుల కోసం సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం అందించాం. త్వరలోనే ప్రతిపాదనలు పంపించి పాడైన రోడ్లకు మరమ్మతు చేపడుతాం.
–మారుతీ, పంచాయతీ రాజ్ ఏఈ, మాగనూర్

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్న సూర్యమోహన్‌రెడ్డి



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మరికల్: పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందజేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కాంగ్రెస్ నాయకులు సూర్యమోహన్‌రెడ్డి అన్నారు. మరికల్‌లో పలు కాలనీల్లో కార్యదర్శి శ్యామ్‌సుదంర్ రెడ్డితో కలిసి శుక్రవారం ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేశారు. మొదటి విడతలో ఎంపిక చేసిన వారికి దశల వారిగా ఇళ్లు నిర్మించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మరికొంత మందికి రెండో విడతలో అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వీరన్న, పట్టణ అధ్యక్షుడు హరీష్, కృష్ణయ్య, రామకృష్ణ, గోవర్ధన్, రామకృష్ణారెడ్డి, ఆంజనేయులు, రఘు, గోపాల్, శ్రీను, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

మాగనూర్: గ్రామాల్లో ఇళ్లులేని ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లను అందిస్తున్నామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని అమ్మపల్లిలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు శుక్రవారం భూమిపూజ నిర్వహించి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేదలకు అండగా ఉండడమే కాంగ్రెస్ ధ్యేయమన్నారు. ఇందులో కాంగ్రెస్ మండల నాయకులు శివరాం రెడ్డి, రవిందర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్

కొత్తపల్లి: పేదవాడి సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యమని మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గొర్లోనిబాయి గ్రామ పంచాయతీలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు శుక్రవారం ఆయన మార్కింగ్ వేసి లబ్ధిదారులకు ప్రోసీడింగ్ పత్రాలను అందజేశారు. సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించడంతో మండలం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణయ్య, వెంకటేశ్, అబ్బు, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ పత్రాల అందజేత

కోస్గి రూరల్: రాష్ట్రంలోని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తోగాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ సాయిలు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తోగాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేసి ప్రొసీడింగ్ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్లు త్వరగా కట్టుకుంటే ప్రభుత్వం విడతల వారీగా నిధులు మంజూరు చేస్తుందన్నారు. కార్యాక్రమంలో శేఖర్, వెంకటేష్ , రామాంజీ తదితరులు ఉన్నారు.

పేదల సొంతింటి కల కాంగ్రెస్‌తో సాకారం

దామరగిద్ద: పేదల సొంతింటి కలను నేరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని మండల పార్టీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి ఖాజా, అంజప్పలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రలో లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇంటి నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదలకు వరమన్నారు. ప్రభుత్వం అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేసి విడతల వారీగా నగదును అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కన్కిరెడ్డి, వెంకట్రామరెడ్డి, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

మరికల్: తమను అన్యాయంగా అరెసట్ చేయడం దారుణమని పంచాయతీ కార్మికులు తెలిపారు. తమ సమస్యల పరిష్కారానికి చలో హైదరాబాద్‌కు తరలివెళ్తున్న పంచాయతీ కార్మికులను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ క్రమంలో కార్మికులు పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వెంటనే తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో రాజు, రాము, మహేశ్ పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టు



ధన్వాడ: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై చలో కమిషనరేట్ ముట్టడికి బయలుదేరిన ధన్వాడ గ్రామ పంచాయతీ కార్మికులను శుక్రవారం స్థానిక పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. అరెస్ట్ చేసిన వారిలో బాలకృష్ణ, ఉదయభాను, ఇమ్రాన్, బాలయ్య, రాజు, నిరంజన్, సద్దాం, లక్ష్మణ్, నర్సింములు ఉన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

మక్తల్: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టగా దంపు చేసిన ఇసుకను టిప్పర్‌లో కర్ణాటకకు తరలిస్తుండగా పట్టుకొని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రుణమాఫీపై అన్నదాతల హర్షం

కొత్తపల్లి: ప్రభుత్వం ఆరు గ్యారెంటీలలో భాగంగా రైతు రుణమాఫీ చేయడంతో మండలంలోని పలు గ్రామాల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కొత్తపల్లి గ్రామానికి చెందిన 350 మంది రైతులకు దాదాపు రూ.2.45 కోట్లు రుణమాఫీ చేసినట్లు ఏఓ రమేశ్ తెలిపారు. మండలంలోని రైతులకు వ్యవసాయ భూములపై రుణాలను గుండుమాల్ ఏపీజీవీబీ, ఐఓబీ కొతులాబాద్, లింగాల్ చేడ్, దమ్‌గాన్ పూర్ సహకార బ్యాంకులు రుణమాఫీ జరిగిన రైతులకు తిరిగి రుణాలు కుడా అందిస్తున్నట్లు తెలిపారు. ఒకే కుటుంబంలో ఇద్దరు పట్టాదారులు ఉండి రూ.2 లక్షల పైన ఉన్న బ్యాంకు రుణాల విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు.

సాగుకు ముందే విత్తనాలు అందించాలి

దామరగిద్ద: ప్రభుత్వం జాతీయ ఆహార భద్రతా మిషన్‌లో రైతులకు అందించే విత్తనాలతో ఎలాంటి ఉపయోగం లేకుండా పోయిందని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం నాయకులు తాయప్ప ఓ ప్రకటనలో విమర్శించారు. కంది తదితర సబ్సిడీ విత్తనాలు పంటల సాగు అనంతరం రైతులకు అందిస్తుండడంతో ప్రభుత్వ ఉద్దేశం నెరవేరడం లేదన్నారు. సాగుకు ముందే విత్తనాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

రూ.10 లక్షలు బీమా సౌకర్యం కల్పించాలి



మాట్లాడుతున్న గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్

నారాయణపేట: గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కిల్లే గోపాల్, ఉడత రవీందర్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం రెండో విడత డీడీలు కట్టించుకుని గొర్రెలను పంపిణీ చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మేనిఫెస్టోలో హామీ ఇచ్చి నేటికీ నెరవేర్చలేదన్నారు. అలాగే వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో జీవాలకు సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, సరిపడే మందులు టీకాలు సంచార వాహనాన్ని అందుబాటులో ఉంచాలన్నారు. వలస వెళుతున్న గొర్రెల కాపర్లకు రక్షణ కల్పించి రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

హిందూ సంప్రదాయాలను రక్షించాలి



చేతులకు గోరింటాకు పెట్టుకొని సంబరాలు చేసుకుంటున్న మహిళలు

నారాయణపేట: హిందూ సంస్కృతి సంప్రదాయాలు గొప్పవని.. వాటిని పరిరక్షించాలని శక్తి పీఠం వ్యవస్థాపకులు డాక్టర్ స్వామి శాంతానంద్ అన్నారు. ఆషాఢ మాసం సందర్భంగా శుక్రవారం స్థానిక శక్తి పీఠం, శ్రీ సంత్‌మఠ మూల మహాసంస్థానంలో మహిళలందరూ అమ్మవారిని పూజించి సామూహిక గోరింటాకు పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వామీజీ భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకొని రసాయనాలను కలిపిన మెహందీకి బదులుగా సహజసిద్ధంగా గోరింటాకు చెట్టు ఆకుల నుంచి తయారు చేసిన గోరింటాకును వినియోగించాలన్నారు. కార్యక్రమంలో శక్తి పీఠం ట్రస్టు సభ్యులు దోమ సుధాకర్, శక్తి పీఠం మహిళా సేవా సమితి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల వెనుక పెద్ద కుట్ర



మాట్లాడుతున్న యాదవ మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘువీర్

మద్దూరు: రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మత ప్రాదిపాదికన బీసీ రిజర్వేషన్లు అమలు చేయడం సరికాదని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘువీర్‌యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది సెప్టెంబర్ 30లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243–డి6 ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికే ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల విషయంలో రాజకీయాలు చేయకుండా చిత్తశుద్ధితో రిజర్వేషన్ల పెంపుపై కార్యాచరణ మొదలు పెట్టాలన్నారు. బీసీ రిజర్వేషన్లలో ముస్లిం, మైనార్టీలను మినహా ఇంచి బీసీలకు జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కాంగ్రెస్ బీసీ రిజర్వేషన్ల వెనుక పెద్ద కుట్ర దాగి ఉందన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు వెంకటయ్య, బస్వరాజ్, నాగులు, లాలప్ప, రాములు, సాయికుమార్, కృష్ణ, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



సదానందాచారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాజేందర్‌రెడ్డి

ధన్వాడ: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి వాటిని అమలు చేయడంలో విఫలమైందని మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం ధన్వాడ మండలంలోని కొండాపూర్‌లో ఇటీవల మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త వడ్ల సదానందాచారి చిత్రపటానికి నివాళులర్పించి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ రైతు భరోసాను మూడు విడతలు ఇవ్వకుండా నిలిపివేసి ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఒక విడత రైతు భరోసా డబ్బులను రైతుల ఖాతాల్లో విమర్శించారు. ఇది కేవలం ఎన్నికల స్టంట్ అని ఎన్నికలైన తరువాత రైతు భరోసా ఊసే ఉండదన్నారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్, లక్ష్మరెడ్డి, సునీల్‌రెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

2న మున్సిపల్ రెవెన్యూ సదస్సు

కోస్గి రూరల్: మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో నెలకొన్న గృహ సమస్యల పరిష్కారానికి జూలై 2న మున్సిపల్ రెవిన్యూ సదస్సును నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. శుక్రవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ సదస్సులో వంశ పారంపర్యంగా వచ్చే ఆస్తి భాగాలను కుటుంబ సభ్యుల సమ్మతితో మార్చడం , ఇంటి నంబర్లలో మార్పులు, పేర్లు తప్పులుగా ఉంటే మార్పులు చేసుకోవచ్చని తెలిపారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సదస్సు జరుగుతుందని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మెనేజర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సబ్సిడీపై కంది విత్తనాల పంపిణీ



రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు, కాంగ్రెస్ నాయకులు

నర్వ: కంది పంట సాగులో నూతన రకాలను ప్రోత్సహించే విధానంలో భాగంగా ఎల్ఆర్‌జీ–52 రకం కంది విత్తనాలను అందింస్తున్నట్లు ఏఓ అఖిలారెడ్డి అన్నారు. శుక్రవారం నర్వ రైతు వేదికలో పలువురు రైతులకు 100 శాతం సబ్సిడీతో కంది విత్తనాలు అందజేశారు. కందిలో అధిక దిగుబడి సాధించేలా శాస్త్రవేత్తల సూచనలతో విత్తనాలను విత్తుకోవాలన్నారు. అవసరమైన రైతులు పట్టాదారు పాసుబుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌లను అందజేసి ఏఈఓల ద్వారా కంది విత్తనాలను పొందాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్, నాయకులు కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శరణప్ప,రాజారెడ్డి, అయ్యన్న,నర్సింహా ఏఈఓలు శ్వేత, అర్షియా, క్రాంతి, కథలప్ప పాల్గొన్నారు.

పదోన్నతులతో కూడిన బదిలీలు చేపట్టాలి



మంత్రి వాకిటి శ్రీహరికి వినతిపత్రం ఇస్తున్న జీహెచ్‌ఎంలు

నారాయణపేట రూరల్: విద్యాశాఖలో స్కూల్ అసిస్టెంట్ నుంచి జీహెచ్‌ఎంలుగా పదోన్నతి ప్రక్రియ చేపట్టాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, సమాంతరంగా టీచర్ల బదిలీలు సైతం చేపట్టాలని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు నిజాముద్దీన్ కోరారు. ఈ మేరకు శుక్రవారం మంత్రి వాకిటి శ్రీహరికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. మల్టీ జోన్ పోస్ట్ వల్ల ఇతర జిల్లాల్లో పదోన్నతి పొందిన జీహెచ్‌ఎంలను సొంత జిల్లాలకు పంపించేందుకు కృషి చేయాలని అలాగే ఖాళీగా ఉన్న జీహెచ్‌ఎం పోస్టులను భర్తీ చేయాలని కోరారు. బదిలీకి జీరో సర్వీసును పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆంజనేయులు, బాలాజీ, అనిల్ గౌడ్, మురళీధర్‌రెడ్డి, కృష్ణారెడి పాల్గొన్నారు.

మహిళలకు అండగా ‘షీ టీం’



అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు

నారాయణపేట రూరల్: రాష్ట్రంలో మహిళలకు అండగా షీ టీం ఉందని కానిస్టేబుల్ చెన్నయ్య అన్నారు. మండలంలోని బైరంకొండ స్కూల్‌లో విద్యార్థినులకు శుక్రవారం షీ టీం సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తుల నుంచి ఏదైనా ఇబ్బందులు ఎదురైతే టి సేఫ్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. బస్సుల్లో ప్రయాణం చేసేటప్పుడు, బస్టాండ్‌లో పోకిరీలు ఎవరైనా ఈవ్ టీజింగ్‌కు పాల్పడినా, మాయమాటలతో సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు అనుమానం వచ్చినా డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల డీపీలతో వాట్సాప్ కాల్ చేసి డబ్బులు పంపమని అడిగితే నిరాకరించాలని, లాటరీల పేరుతో మోసం చేసేవారి నుంచి జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు కవిత, జ్యోతి, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి



రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దామరగిద్ద: గ్రంథాలయాల్లో పార్ట్ టైం వర్కర్స్‌గా, స్వీపర్లుగా పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర గ్రంథాలయ సంస్థ పరిషత్ చైర్మన్ రియాజ్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో 25 ఏళ్లుగా పది మంది పార్ట్‌టైం ఉద్యోగులుగా పనిచేస్తున్నారని తెలిపారు. తమను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు పెంచాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక గ్రంథాలయ వర్కర్స్ వెంకటప్ప, రాఘవేందర్, నర్సింములు, శ్రీను పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. తప్పిన ప్రమాదం



బోల్తా పడిన ఆటో

ఊట్కూరు: మండలంలో శుక్రవారం ప్రమాదం తప్పింది. ఎలు కల్వర్టులకు రేలింగ్ లేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఊట్కూరు నుంచి ముగ్దుంపూర్ గ్రామ సమీపంలో ఇటీవల వాగుపై కల్వర్టు నిర్మించారు. అయితే కల్వర్టుకు ఇరువైపులా రేలింగ్ ఏర్పాటు చేయలేదు. దీంతో శుక్రవారం ఊట్కూరుకు వెలుతున్న ఒక ఆటో కల్వర్టు పక్కన బోల్తా పడింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టుపై రేలింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.